క్లుప్తంగా

చెత్త తొలగించారు



శ్రీకృష్ణ ఆలయం వద్ద చెత్తను తొలగించిన పారిశుధ్య సిబ్బంది

వేంపల్లె : వేంపల్లె గ్రామ పంచాయతీలో పారిశుధ్య సిబ్బంది చెత్తాచెదారాలను తొలగించారు. గురువారం సాక్షి దినపత్రికలో ‘మాటల్లో ఇంపు.. ఊరంతా కంపు’ అనే శీర్షిక ప్రచురితం కావడంతో సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, ఈఓ మాధవరెడ్డిలు చొరవ తీసుకుని పారిశుధ్య సిబ్బందితో మాట్లాడి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కొన్ని ప్రాంతాల్లో చెత్తా చెదారాలను తొలగించారు. స్థానిక వడ్డెర వీధిలోని శ్రీకృష్ణ ఆలయం వద్ద, మేదర వీధి, బాలిశెట్టి వీధి, ఆర్ఎంఎస్ నగర్, పప్పుల బజార్ తదితర ప్రాంతాల్లో చెత్తా చెదారాలను తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో చెత్తా చెదారాలు నిండుకుంటున్నాయి. రెండు, మూడు రోజుల్లో గ్రామ పంచాయతీలో ఎక్కడా కూడా డ్రైనేజీ, పారిశుద్ధ్యం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా పారిశుధ్య సిబ్బందికి త్వరలో జీతాలు కూడా చెల్లిస్తామని చెప్పడంతో సిబ్బంది గ్రామంలోని చెత్తా చెదారాలను తొలగించారు. చాలీచాలని బతుకులు మావని పారిశుధ్య సిబ్బంది ఎప్పటి కప్పుడు జీతాలు చెల్లించాలని వేడుకున్నారు.

ప్లే గ్రౌండ్స్‌గా మారుస్తాం



కంపచెట్లు తొలగిస్తున్న సీఐ ఎస్‌కే రోషన్, ఎస్‌ఐ విద్యాసాగర్

కమలాపురం : అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన స్థలాలను ప్లే గ్రౌండ్స్‌గా మారుస్తామని సీఐ ఎస్‌కే రోషన్, ఎస్‌ఐ విద్యా సాగర్ తెలిపారు. గురువారం ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పట్టణంలో బహిరంగంగా మద్యపానం సేవిస్తున్న పలు ప్రాంతాలను గుర్తించి వాటిని ఆట స్థలాలు మార్చారు. పోకిరోళ్లు అడ్డాగా చేసుకున్న ప్రాంతాలలో జేసీబీ సాయంతో కంపచెట్లను తొలగించి శుభ్రం చేసి ప్లే గ్రౌండ్స్‌గా మార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాస ప్రాంతాలకు దగ్గరగా బహిరంగంగా మద్యం సేవించడం, పేకాట ఆడటం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అటాంటి ప్రాంతాలుంటే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తాము ఆ ప్రాంతాలను శుభ్రం చేసి ఆట స్థలాలు మార్చి ఆ కాలనీకి చెందిన చిన్నారులు అడుకునే విధంగా తయారు చేస్తామన్నారు. పోలీసులు చేసిన ఈ పనులకు సంతోషించిన పట్టణ ప్రజలు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.


నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక అమ్మవారిశాలలో గురువారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అమృత కలశం పేరుతో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు రవికుమార్‌లు వాసవీ క్లబ్ సభ్యులతో కలిసి బ్రాహ్మణ, ఆర్యవైశ్య కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రతినెలా అమావాస్య రోజు దాతల సహాయ సహకారాలతో నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వినోద్‌కుమార్, సెక్రటరీ మహేష్ గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : మానవాళి మనుగడకు ప్రకృతి వ్యవసాయం తప్పనిసరి అని వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక అంబకపల్లె రోడ్డులో ఉన్న మినీ సెక్రటేరియట్‌లో రైతు సేవా సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతులలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తారంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ ఏక పంట విధానానికి స్వస్తి పలికి పలు పంటల సాగు విధానంపై దృష్టి సారించాలన్నారు. పలు పంటల విధానంవల్ల రైతుకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఓలు చెన్నారెడ్డి, ఓబులేసు, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

ముక్కు పుటాలు అదురుతున్నాయ్

- పూడిపోయిన ఇడుపులపాయ సప్లై కెనాల్
- గండి టూరిజం హోటల్ వద్ద దుర్గంధం
- దుర్వాసన భరించలేకున్న గండి చౌడేశ్వరి కాలనీ వాసులు



రాయచోటి-వేంపల్లె ప్రధాన రహదారిలో ఉన్న కాలువలో పేరుకు పోయిన చెత్త చెదారం

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి ఆలయానికి కూత వేటు దూరంలో ఉన్న టూరిజం హోటల్ వద్ద పేరుకుపోయిన చత్తాచదారంతో, అలాగే చౌడేశ్వరీ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచదారంతో స్థానికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. గండిక్షేత్రం వద్ద నుంచి ఇడుపులపాయ గ్రామంలోని వ్యవసాయ పొలాలకు నీటిని అందించే కాలువలో నీరు నిండుకుని కంపు కొడుతోంది. దోమలు కూడా ఎక్కువగా ఉండటంతో వారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. రెండేండ్ల క్రితం శ్రావణ మాస ఉత్సవాల సమయంలో అధికారులు మురికి నీటిని తొలగించారు. అనంతరం పట్టించుకోలేదు. గండికి వచ్చే భక్తులు టూరిజం హోటల్‌కు వెళ్లి ఏమైనా తినడానికి కూడా జంకుతున్నారు. కారణం హోటల్‌లోనికి వెళ్లే ముందు కాలువలో కనిపించే రోత, దుర్వాసనలను భరించలేక వెళిపోతున్నారు. చౌడేశ్వరీ కాలనీ వాసుల పరిస్థితి అయితే మరీ దుర్భరంగా ఉంటోంది. రాయచోటి వేంపల్లె ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి వెళ్లాలంటే ఈ కాలువపై నుంచే వెళ్లాలి.. కాలనీలోకి వెళ్లే దారికి మాత్రం సిమెంటు కాంక్రీటుతో స్లాబు వేశారు. మిగతా అంతా వదిలేశారు. దీంతో ఏమాత్రం ఏమరు పాటుకు గురైతే బురద కాలువలో పడిపోతారు. కాలనీ వారి బాత్‌రూముల్లోంచి వచ్చే నీరు కూడా ఈ కాలువలోకే వచ్చి చేరుతుంది. పైగా ప్రధాన రహదారిపై వెళ్లే వారు వేసే ప్లాస్టిక్ కవర్లు, నీళ్ల బాటిల్లు, ప్యాకెట్లు గాలిలో కొట్టుకు వచ్చే చెత్త అంతా ఆకాలువలో పడి కుళ్లి కంపుకొడుతోంది. కాలనీ వద్ద ఐదు నిముషాల పాటు నిలబడాలన్నా భయవేస్తోందని పలువురు వాహణ చోదకులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కాలువలోని మురికి నీటిని తొలగించి దుర్గంధం నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.



టూరిజం హోటల్ వద్ద మురుగు నీటితో నిండుకున్న కాలువ

పాములు సంచరిస్తున్నాయ్



ఒక పక్క కాలువలో నిండుకున్న బురద నీటితో వాసన, మరోపక్క దోమలు, కొండలోంచి వచ్చే పాములతో భయంతో గడుపుతున్నాం. పైగా కాలువపై మూత లేక పోవడంతో చిన్న పిల్లలు ఎక్కడ ఆడుకుంటూ వచ్చి కాలువలో పడతారో ననే భయం మరోపక్క ఉంది. కనీసం కాలువలో ఉన్న బురద నీరు లేకుండా చేసినా కొంత వరకు మేలు చేసిన వారు అవుతారు.

– పఠాన్ ఖాదర్‌వల్లి, చిరువ్యాపారి, చౌడేశ్వరీ కాలనీ

కొనేవారు కూడా నిలబడలేని పరిస్థితి



బతుకు తెరువు కోసం కాలువపైనే చిన్న అంగడి పెట్టుకున్నా. కాలువలోంచి వచ్చే వాసనకు ఎవ్వరూ కొనడానికి కూడా రాలేదు. దోమలు ఎక్కువ అయ్యాయి. ఇక్కడే కూర్చుని వాసన అలవాటై పోయింది. మాగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియలేదు. కాలువ గట్టుపైనే ఇల్లు, తలుపులు తెరిస్తే అందులోనూ ఉండలేం.

– వెంకటసుబ్బయ్య, చిరువ్యాపారి, చౌడేశ్వరీ కాలనీ

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తరించాలి

ముద్దనూరు : వ్యవసాయ, రైతు సేవాకేంద్రాల్లోని సిబ్బంది రైతులతో మమేకమై ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తరింపజేయాలని ముద్దనూరు డివిజనల్ వ్యవసాయాధికారి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు మండలాల రైతు సేవాకేంద్రాల సిబ్బందికి ప్రకృతి వ్యసాయంపై 3 రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడతూ నేల కలుషితం కాకకుండా సహజ సిద్ధ పద్ధతులద్వారా పంటలను సాగు చేసే విధానాన్ని అవలంభించేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతుల ద్వారా పండించే ఉత్పత్తులకు భవిష్యత్‌లో మరింత డిమాండ్ వుంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఎస్‌పీఎంయూ సురేష్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ నాగ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా సమితి సభ్యుడిగా ఈశ్వరయ్య

తొండూరు : బద్వేల్ పట్టణంలో బుధవారం జరిగిన సీపీఐ జిల్లా 25 మహా సభల సందర్భంగా ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభలో తొండూరు మండలం భద్రంపల్లెకు చెందిన బుర్రి ఈశ్వరయ్య సీపీఐ జిల్లా సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు. నా ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి కార్యకర్త టీడీపీ వైఫల్యాలను ప్రజలకు చెప్పాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త టీడీపీ వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం సాయిశివాణి కల్యాణ మండపంలో ఆయన కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కష్టపడి రాబోయే స్థానిక ఎన్నికల్లో తమ బలం ఎమిటో చూపిద్దామన్నారు. ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటానని ఇప్పటికే హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఎన్నికల సమయంలో మైలవరం మండలంలో పర్యటించి ఎసీసీ బాధిత రైతులకు ఎకరాకు అదనంగా రూ.4 లక్షలు ఇస్తామన్నారు. దుగ్గనపల్లి గ్రామాన్ని మరోచోటకు మార్పు చేస్తామన్నారు. రైతులకు సంబంధించిన భూములను కొనుగోలు చేస్తామని అనేక హామీ ఇచ్చారు. పెద్దముడియం మండలంలోని రాజోళి ఆనకట్ట ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వస్తే రూ.24 లక్షలు ఇప్పిస్తామన్నారు. కొండాపురం మండలంలోని ముంపువాసులకు రూ.10 లక్షలతోపాటు అదనంగా మరో రెండు లక్షల పరిహారం ఇప్పించే బాధ్యత నాదని ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా ఇంత వరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, బీసీ రాష్ట్ర కార్యదర్శి లక్షుమయ్య, జిల్లా మున్సిపల్ విభాగ అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, గిరిధర్‌రెడ్డి, లోగిడి జయన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, వార్డు కౌన్సిలర్లు ముల్లాజానీ, పోచిరెడ్డి, వేణు, ఎస్సీ సెల్ నాయకులు మార్బల్ శ్రీను, కిరణ్, రఘునాథ్‌రెడ్డి, ఫయాజ్, నరసింహులు, గురుమూర్తి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో చంద్రబాబు మోసం



ఉలవలపల్లెలో ప్రజలకు వివరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్‌రెడ్డి

పెండ్లిమర్రి : అబద్ధపు హామీలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసం చేశాడని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి మండిపడ్డారు. గురువారం ఉలవలపల్లెలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ పై ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. 13 నెలల పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రతి కుటుంబానికి ఎంత నష్టం జరిగిందో ప్రజలకు గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, రాజారెడ్డి, సుబ్బరామిరెడ్డి, రామాంజనేయరెడ్డి, వెంకట శివారెడ్డి, నాగేంద్రారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, వీరారెడ్డి, రామమోహన్‌రెడ్డి, చావలి శివ, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : వంచనకు మారుపేరు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎన్.పాలగిరిలో మండల కన్వీనర్ నఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రబాబు ష్యూరిటీ మోసానికి గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న మోసాలను తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, నాగమునిరెడ్డి, రామచంద్రారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగభూషణం, చెంద్రాయుడు, జనార్దన్, ఓబులేసు, గురివిరెడ్డి, రామదాసు మిద్దె చెంద్రాయుడు,వెంకటసుబ్బన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు



శిక్షణ కార్యక్రమాన్ని తిలకిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో కమలాపురం, వల్లూరు మండలాల ఆర్ఎస్‌కే సిబ్బందికి, ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మొదటి రోజు ఈవీసీ విజయ్‌కుమార్ వర్చువల్ మీటింగ్ ద్వారా ప్రకృతి వ్యవసాయం యొక్క ఆవశ్యకతను, ప్రాముఖ్యతను, (సైన్స్ బిహైండ్ నేచురల్ ఫామింగ్) వివరించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులను మోటివేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ప్రవీణ్‌కుమార్, అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ఏఓలు సరస్వతి, కిరణ్ కుమార్‌రెడ్డి, ఏడీఏ(డీఆర్‌సీ) అశోక్‌రెడ్డి, ఏఓ సుచిత్ర, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలు



పులివెందులలో చౌడేశ్వరి అమ్మవారిని ఊరేగిస్తున్న మహిళా భక్తులు



దుగ్గాయపల్లెలో 108 కళశాలతో అమ్మవారి ఆలయానికి వస్తున్న మహిళలు



కన్నెలూరులో బిందె సేవలో పాల్గొన్న మహిళా భక్తులు



పూజల్లో పాల్గొన్న ఏపీఎస్ఆర్‌టీసీ మాజీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శ్రీరామలింగ చౌడేశ్వరిదేవి దేవస్థానంలో గురువారం శ్రీచౌడేశ్వరిదేవి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. దేవాంగ సంక్షేమం సంఘం, ఆలయ కమిటీ సభ్యుడు మచ్చా రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక పిరమిడ్ నగర్‌లోని శ్రీచౌడేశ్వరిదేవి జ యంతి ఉత్సవాలు జరిగాయి. ఆలయ అర్చకులు అంజి, ప్రసాద్ నేతృత్వంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసి రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి దేవాలయంలో నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళా భక్తులు పట్టణంలోని పురవీధుల గుండా బిందె సేవా కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్నెలూరు గ్రామంలో భక్తులు పురవీధుల గుండా బిందె సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : శ్రీ చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీచౌడేశ్వరిదేవి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం, అర్చన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. మండలంలోని ఉప్పలూరు, యామవరం గ్రామాల్లోని ఆలయాల్లో జరిగి వేడుకల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : పడమటవీధిలోని శ్రీ రామలింగచౌడేశ్వరిదేవి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో శ్రీ చౌడేశ్వరీ మాత జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దుగ్గాయపల్లె, పెద్దపుత్త గ్రామాలకు చెందిన మహిళలు తమ గృహాల నుండి కళశ జలాన్ని తీసుకుని అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. నడివీధి గంగమ్మ వద్ద పూజలు నిర్వహించారు. అక్కడి నుండి మేళతాళాలతో మహిళలు బోనాలతో గ్రామోత్సవంగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అన్నదానం నిర్వహించారు. కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. దీపోత్సవాన్ని నిర్వహించారు. వెంకటాపురం వీవర్స్ కాలనీలోని చౌడేశ్వరీ మాత ఆలయంలో జలాభిషేకం నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. రాత్రి గండర జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహించారు. ఏపీఎస్ఆర్‌టీసీ మాజీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి సతీమణితో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డిగారి వీరారెడ్డి, ఆయన సతీమణి, ఎంపీపీ మల్లేశ్వరమ్మ, శంకర్‌రెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరులో అమ్మవారి జయంతోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని ఎగువపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి ఐదవ వార్షికోత్సవ ఉత్సవాలు ఆలయ కార్యనిర్వహకుల ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్ పూర్తి



కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్‌లను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్

జమ్మలమడుగు : ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఐటీఐలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలక్ట్రికల్, మెకానికల్, ఫిట్టర్ సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించామని ప్రస్తుతం ఉన్న సీట్లన్నీ మెరిట్ ప్రకారం భర్తి చేస్తామన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరై సీట్లు దక్కించుకున్నవారు కాలేజీకి రానివారు ఉంటే తిరిగి ఆ సీట్ల భర్తికి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆయన సూచించారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జరి వైద్య నిపుణురాలు డాక్టర్ దీప్తి బత్తు కాస్మెటిక్ సర్జరి, హ్యాండ్ సర్జరి, మైక్రో వ్యాక్యులర్ సర్జరి, ట్రామా రీకంస్ట్రక్షన్, బర్న్ సర్జరి, డయాబెటిక్ ఫూట్ సర్జరి, క్రానియో ఫేషియల్ సర్జరి, అన్యో రీకంస్ట్రటివ్ సర్జరి సేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568 286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రైతులను వెన్నుపోటు పొడుస్తున్న కూటమి సర్కార్

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.55వేల నుంచి రూ.70 వేలు పలికిన చీనీ ధర
- విలేకరుల సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : దళారులతో కుమ్మక్కై రైతులను వెన్నుపోటు పొడుస్తున్న ఘనత కూటమి సర్కార్‌కు దక్కుతుందని పులివెందుల వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పాత ఎమ్మెల్యే ఆఫీస్ ఆవరణలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చీనీ కాయలను ఇతర మార్కెట్లకు తరలించకుండా ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకునే విధంగా సుమారు రూ.5 కోట్లతో చీనీ కాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారన్నారు. పులివెందుల ప్రాంతంలో పండించిన అరటికి ఇతర దేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉండటంతో ఈ ప్రాంతంలో పండించిన అరటిని రైతులు నిల్వ చేసుకుని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకునే విధంగా రూ.28 కోట్లతో కోల్డ్ స్టోరేజ్‌ను నిర్మించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలవుతున్నా కోల్డ్ స్టోరేజ్ గురించి పట్టించుకోలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో టన్ను చీనీ కాయలు రూ.55వేల నుంచి రూ.70వేల వరకు ధరలు పలికాయన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం రూ.18వేల నుంచి రూ.27వేలు మాత్రమే చీనీ ధరలు ఉన్నాయన్నారు. రైతులు పండించిన పంట అకాల వర్షాలతో దెబ్బతినడంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు స్పందించి రైతులకు వారి అకౌంట్లలో డబ్బులు వేసేవారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతనే ఆయన హయాంలో పులివెందుల ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దారన్నారు. నియోజవర్గంలోని ఏడు మండలాల రైతులు తమ పండించిన పంటలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు డబ్బులు ఖర్చు అవుతాయన్న ఉద్దేశ్యంతో గోడౌన్లను నిర్మించిన ఘనత కూడా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పులివెందుల ప్రాంతంలో పండించిన చీనీ కాయలకు సూట్ లేకుండా చీనీ కాయల మార్కెట్లను కొనుగోలు చేసి నేరుగా రైతుల అకౌంట్లోకి డబ్బులు వేసిన ఘనత కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, అప్పటి ఓఎస్డీగా పనిచేస్తున్న కృష్ణమోహన్‌రెడ్డిలకు దక్కుతుందన్నారు. రెండు రోజుల క్రితం టీడీపీ నాయకులు పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లోని చీని కాయల మార్కెట్‌ను సందర్శించి అధికారులు, వ్యాపారాలు, రైతుల గురించి, దళారులు మోసం చేస్తున్నారని బీటెక్ రవి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు, ఇప్పటికైనా మీకు నిజంగా రైతులపట్ల చిత్తశుద్ధి ఉంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో కోల్డ్ స్టోరేజ్‌తోపాటు మిగిలిన అభివృద్ధి పనులు 95 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 5 శాతం పనులను మీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, కసుక, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, బాలఅశ్వర్థరెడ్డి, చంద్రమౌళి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత భారతావని నిర్మిద్దాం



మాదక ద్రవ్యాల నివారణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి

పులివెందుల టౌన్ : మత్తు పదార్థాల వాడకం మానవాళి మనుగడకి పెను ప్రమాదంగా మారిందని, ఈ డ్రగ్స్ పెనుభూతంలా వెంటాడుతున్నాయని, మత్తు రహిత భారతావని నిర్మిద్దామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ గంజాయి లాంటి మాదక ద్రవ్యాలు మానవాళిని పెనుభూతంలా వెంటాడుతున్నాయని, వీటిని అరికట్టాలంటే ప్రజల సహకారం తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శరణ్య మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం, గంజాయి, కొకైన్ లాంటి మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు మోతాదుకు మించి వాడితే జ్ఞాపక శక్తి తగ్గడంతోపాటు అనారోగ్యానికి గురవుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ గణేష్, సేవా సమితి అధ్యక్షుడు రాజు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ నాగేంద్రమ్మ, ఈగల్ క్లబ్ కో ఆర్డినేటర్లు అనిత, షీల, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో 2003 డీఎస్సీ అభ్యర్థులకు పాత పెన్షన్ అమలు చేయాలని ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకట జనార్ధన్ రెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లను ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్ధన రెడ్డి కలిశారు. ఈ మేరకు 2003 డీఎస్సీ ఫోరం సభ్యులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో 2003 డీఎస్సీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి రవీంద్ర రెడ్డి, జిల్లా కన్వీనర్లు కురుకుటి సుధాకర్, రిజ్వానలి, ప్రొద్దుటూరు నియోజకవర్గం బాధ్యులు అచ్చుకట్ల చాంద్ బాషా, అనంతపురం జిల్లా కన్వీనర్ గజ్జల ప్రభాకర్, ప్రకాశం జిల్లా కన్వీనర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.